# మినీకథ



# ముద్దాయి

కిటకిటలాడుతున్న కోర్టు రూమ్‌కు జడ్జీగారు రావడంతో నిశ్శబ్దం ఆవరించింది. "యువర్ ఆనర్— బోనులో ఉన్న ముద్దాయి పేరు సత్యశీలన్. ఇతడు చేసిన నేరాలు: తల్లితండ్రులమాట జవదాటని పాపాత్ముడు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరి డబ్బుకి ట్యూషన్లు చెప్పడానికి నిరాకరించిన దుర్మార్గుడు. నాలుగువందల రూపాయలకి రసీదు మీద సంతకం చేసి మూడు వందల రూపాయలు జీతం తీసుకోవడానికి మన స్వొవ్వక రాజీనామా చేసిన మూర్ఖుడు. ఆర్. టి పి. లో కండక్టర్ ఉద్యోగం సంపాదించి ప్రయాణీకులకు తిరిగి ఇవ్వవలసిన చిల్లర డబ్బులు ఖరా ఖండిగా ముట్టచెప్పి తోటి కండక్టర్లని అవమానపరిచిన కార్మికద్రోహి. పైసా కట్నం లేకుండా తల్లితండ్రులు కుదిర్చిన సంబంధాన్ని చేసుకున్న చవట. తెలుగు సినిమాలు చూడని ఏబ్రాసి. మందు తీసుకుంటావా అని ఎవరో అడిగితే 'నాకేమీ అస్వస్థత లేదే' అన్న తెలివి తక్కువ దద్దమ్మ. వచ్చే జన్మలో దున్నపోతుగానైనా పుడతాను కాని ధూమపానం చేయనని భీష్మించిన అపర భీష్ముడు. సెలవు పెట్ట యింటిదగ్గరే వుండి లీవ్ ట్రావెల్ కన్సెషన్ డ్రా చెయ్యడానికి నిరాకరించిన అధముడు. తనకున్నా లేకపోయినా తనకంటే లేనివాళ్ళ దీనావస్థ చూసి సహాయం చెయ్యడానికి వెనుకాడని కఠినాత్ముడు. ప్రభుత్వ వైద్యశాలలన్నీ పేదప్రజల పాలిట పెన్నిధులని అక్కడ పనిచేసే వైద్యులు, నర్సులు దేవతలు అని తలచే అప్రాచ్యుడు. మనదేశం రామరాజ్యం అని, నాయకులు దేశోద్ధారకులని, నిజాయితీ పరులని, దేశసేవయే వారి ధ్యేయమని, ప్రజా క్షేమమే వారి లక్ష్యమని, ఎప్పటికైనా ధర వరలు తగ్గుముఖం పడతాయని (పగటి) కలలు కంటూ తన ధోరణిలోకి ఇతర ప్రజలను రప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్న ఈ విప్లవకారుని కఠినంగా శిక్షించమని కోర్టువారికి మనవి చేసుకుంటున్నాను" అని న్యాయవాది పాపాలరావు కుర్చీలో చతికిలపడ్డాడు. జడ్జీగారు ఏం తీర్పు యిస్తారాని ఎదురుచూస్తున్నారు. "ముద్దాయి సత్యశీలన్ ప్రస్తుత రాజకీయ, సాంఘిక వ్యవస్థలో యిమడలేని వ్యక్తి. ప్రవాహానికి ఎదురీదడానికి ప్రయత్నించి విఫలుడవుతున్న మూర్ఖుడు. ఇతనికి శిక్షంటూ వేరే ఏమీలేదు. ఇప్పుడున్న వ్యవస్థ ఇలాగే కొన్ని వేల సంవత్సరాలు కొనసాగాలని, ముద్దాయి అష్ట దరిద్రాలతో సకల విపత్తులతో నూరు సంవత్సరాలు చస్తూ బ్రతకాలని దేవుని ప్రార్థిస్తున్నాను." కోర్టు రూమ్‌లో మిన్ను ముట్టే కరతాళధ్వనులు.

—ఓ. ఆర్. కె. రావ్

